# మినీకథ

## మధ్యతరగతి మనస్తత్వం

అపర్ణాదీక్షిత్



"స్టీలు ప్లేటు తీసికెళ్ళి, తీసికెళ్ళలేదని దబాయించింది రాస్కెల్! ఎంత పెట్టినా ఈ పనిమనుషుల్లో తృప్తి ఉండదు. నీతి నిజాయితీ ఒక్కదానిలోనూ కనిపించదు." ప్రక్కింటావిడ వాక్ ప్రవాహం టక్కున ఆగిపోయింది, పరుగున వస్తున్న పనిమనిషి సింహాచలాన్ని చూసి.

"ఏమిటంత ఆయాసపడుతూ వచ్చావ్" నవ్వుతూ అడిగేను.

"మా సచ్చినోళ్ళందరూ తన్నుకుండా రమ్మా. పోలీసోళ్ళు వచ్చి అందర్నీ లాక్కెళ్ళిపోతున్నారు. ఇంట్లో జొరబడి డబ్బు కూడా తీసుకుపోతున్నారుట. మా సిట్టెమ్మ సెప్పింది. ఈ యాభై రూపాయలు దాచండి. మళ్ళీ వచ్చి తీసుకుంటాను" అంటూ చిత్తుకాగితాల్లా ఉన్న యాభై రూపాయలు నాచేతిలో కుక్కి కంగారుగా వెళ్ళిపోయింది.

నేను వాటిని బొత్తిగాపెట్టి, లెక్కపెట్టి రేడియో క్రింద పెట్టేను. భోజనానికి శ్రీవారు వచ్చినప్పుడు రేడియో క్రింద నుంచి తొంగి చూస్తున్న నోట్లను చూసి "డబ్బంటే ఏమిటంత నిర్లక్ష్యం?" అన్నారు విసుగ్గా.

"రిక్షావాళ్ళందరూ ఎందుకో కొట్టుకుంటున్నారట. పోలీసులు వాళ్ళందర్నీ లాక్కెళ్ళారు" అని సింహాచలం డబ్బు దాచిన సంగతి చెప్పేను.

"ఈ లేబర్‌ని నమ్మటానికి వీలులేదు. ఈ రోజు యాభై ఇచ్చి రేపు వంద యిచ్చానని దబాయిస్తారు. సాయంత్రం తప్పకుండా ఇచ్చేసెయ్" అన్నాడు.

ఆ సాయంత్రం సింహాచలం రాలేదు.

మార్కెట్‌కి వెడుతూ అందులో పది రూపాయలు తీసుకువెళ్ళేను. మరునాడు ఉదయం అది పని ముగించుకుని వెళ్ళిపోయే సమయంలో బీరువాలోంచి ఏభై రూపాయల నోటు తీసి దానికిచ్చాను.

మళ్ళీ మరునాడు అది పనిలోకి రాలేదు. "జైలులో ఉన్న మొగుడికి అన్నం పట్టుకెళ్ళిందండీ" అని చెప్పింది ఇంటివారి పనిమనిషి.

సాయంత్రం వచ్చి "నా యాభై రూపాయలు ఇవ్వండమ్మా" అంది.

నాకు నోట మాట రాలేదు 'ఇచ్చేశాను కదా' అనేలోపల "ఖర్చుచేశేశారా అమ్మగారు. రేపియ్యండి" అని వెళ్ళిపోయింది.

నాకు మతిపోయినంత పనయింది ఆ రాత్రంతా నిద్రలేదు. 'ఈ రోజు యాభై ఇచ్చి రేపు వంద ఇచ్చానంటారు.' ఆయన మాటలు గుర్తుకొచ్చాయి.

మధ్య రాత్రి ఆయన నిద్ర లేచినప్పుడు నన్ను చూసి "ఇంకా నిద్రపోకుండా ఏమిటోయ్ ఆలోచిస్తున్నావ్?" అని అడిగేరు.

నేను జరిగింది చెప్పేను, అది యాభై ఇస్తున్నప్పుడు అందరూ చూశారు- నేను తిరిగి ఇచ్చినప్పుడు ఎవరూ చూడలేదు.

"నేను ముందే చెప్పేను కదా, ఆలోచించి మనసుపాడుచేసుకోకు రేపు మరో యాభై దానికిచ్చేసెయ్" అన్నారు ఓదారుస్తూ.

దానికి యాభై రూపాయలు ఇచ్చిన సంగతి గుర్తు చేదామనుకుంటే అది అసలు మరచిపోతేగా. మోసగించాలని చూసిన దానికి గుర్తుచెయ్యటమేమిటి? నా వెర్రితనం కాకపోతే

మరునాడు ఉదయం పూనకం వచ్చిన దానిలా ఊగిపోతూ వచ్చింది. దానిని పట్టుకుని మరో అమ్మాయి.

నిశ్చేష్టగా నిలబడిపోయిన నాతో "మీ దగ్గర అది యాభై రూపాయలు దాచుకుందంట కదమ్మగారూ; కడుపు నొప్పి వచ్చింది. వెంటనే ఆస్పత్రిలో చేర్చాల ఆ సొమ్ము ఇవ్వండమ్మగారూ" అంది.

నాకు గొంతులోంచి మాట రావటంలేదు. "నేను ఇచ్చేశాను. నీకు గుర్తులేదా" అన్నాను మెల్లిగా.

"ఇస్తే ఎందుకడుగుతా నమ్మగారూ; డబ్బు తీసుకుని మళ్ళీ మిమ్మల్ని అడిగితే ఈ కడుపు నొప్పితో నేను చచ్చిపోతాను. నా పిల్లలిద్దరిమీదా పెమాణం చేసి చెవుతున్నాను" అంది పూనకం కొద్దిగా ఆపి.

మావారు బయటికి వచ్చి యాభై రూపాయలు దానికిచ్చి పంపేశారు.

"చేసిన నిర్వాకం చాలు, ఇంక లోపలికి రా" అన్నారాయన.

"ఈ బేవనోళ్ళని నమ్మకూడదు" ఈసడింపుగా అంది ఇంటివారి పని మనిషి.

"అది చచ్చినా అబద్ధమాడదు" అంది మా ప్రక్కింటావిడ

లేబర్‌తో తగవెందుకని ఆయన మంచితనంతో ఇచ్చిన డబ్బు- పని మనిషి డబ్బు ఎగవేయాలని చూసి, కుదరక ఇచ్చేసినట్లు భావించేరు.

నా కళ్ళమ్మట నీళ్ళు కారిపోతున్నాయి.

నాలుగురోజులకొకసారి సింహాచలంతో పోట్లాడే ఇంటివారి పనిమనిషి దాని పక్షం మాట్లాడితే కులాభిమానం అనుకోవచ్చు.

వారం క్రితం 'దొంగముండ' అని అన్న ప్రక్కింటావిడ, "నిజాయితీకి అది మారుపేరు" అనటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

పనిమనుషుల్లో. రిక్షావాళ్ళలో ఉన్న ఐకమత్యం మధ్యతరగతి వాళ్ళలో లేనందుకు సిగ్గుపడాలా?